క్లుప్తంగా

ఆటోడ్రైవర్లకు అవగాహన

వీరులపాడు: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలకు తప్పకుండా పాటించాలని ఎస్ఐ మహాలక్ష్మణుడు సూచించారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించటంపై జరిగే ప్రమాదాలపై ఆటోడ్రైవర్లకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను విధిగా వాహనంలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఖాళీస్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



జగ్గయ్యపేట అర్బన్: వర్షాకాలం అయినందున దోమలు, పారిశుద్ధ్య కారణాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పట్టణంలోని ఖాళీ స్థలాలను వాటి యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ సూచించారు. స్థానిక ఆరోవార్డులో గృహాలమధ్య ఉన్న ఖాళీ స్థలాలను మున్సిపల్ కంపెక్టర్‌తో బుధవారం ఆయన శుభ్రం చేయించారు. వార్డులోని రావూస్ హైస్కూల్ వెనుక రోడ్డులో ఖాళీగా ఉన్న స్థలంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయి అధ్వాన్నంగా మారి విష సర్పాలు సమీపంలోని ఇళ్లలోకి వస్తున్నాయన్న స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కంపెక్టర్‌ను తీసుకువచ్చి స్థానికులతో కలసి కంపచెట్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి, స్థలాలను శుభ్రం చేయించేలా చూడాలని కోరారు.

'అయ్యంకి'కి ఘననివాళులు



కొణకంచి(పెనుగంచిప్రోలు):స్థానిక బాలభక్త శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు. 'అయ్యంకి' చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు మాట్లాడుతూ వెంకటరమణయ్య ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులని, పత్రికా సంపాదకుడిగా పనిచేశారని వివరించారు. గ్రంథాలయాల ఏర్పాటు, అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు సీహెచ్ పద్మ, అమృత, గ్రామపెద్దలు ఎర్రం భాస్కరరావు, మాధవి, గూడెపు రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



జగ్గయ్యపేట: ఓ ట్రాక్టర్‌కు ఇచ్చిన వేబిల్లుతో మరో ట్రాక్టర్ ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి ఆ వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..అనుమంచిపల్లి ఇసుక స్టాక్‌యార్డు నుంచి ఏపీ 16 టీక్యూ 0219 ట్రాక్టర్ ఐదు టన్నులతో మంగళవారం రాత్రి సమయంలో జగ్గయ్యపేటకు వస్తుండగా పరిశీలించగా, వేబిల్లుపై మరో ట్రాక్టర్ నంబరు ఉండటాన్ని గుర్తించి వెంటనే సీజ్‌చేసినట్లు మణికంఠరెడ్డి వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఆయన వివరించారు.

ఇసుక లారీలను దారి మళ్లించాలి

రైతుకూలీ సంఘం డిమాండ్

నందిగామ టౌన్:గ్రామీణ ప్రాంత రహదారులపై ఇసుక లారీలు బారులు తీరి ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన బుధవారం మాట్లాడుతూ చందర్లపాడు మండలంలోని కొడవటికల్లు గ్రామ సమీపంలో ప్రభుత్వం ఇసుక స్టాకు యార్డును ఏర్పాటు చేయడంతో ఈ మార్గంలో పెరిగిన ఇసుక లారీల ట్రాఫిక్ కారణంగా ప్రజలు అవస్థలుపడుతున్నారన్నారు. ఈరోడ్డులో నిత్యం వందలాది లారీలు బారులు తీరుతున్నాయన్నారు. లారీల కారణంగా ట్రాఫిక్ నిలిచిపోతుండటంపై ప్రశ్నించిన రైతులపై స్థానిక ఎస్ఐ దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట రైతుకూలీ సంఘం నాయకులు నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరి ఉన్నారు.

అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జగ్గయ్యపేట మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు

గంద్రాయి(జగ్గయ్యపేట): గ్రామాల అభివృద్ధిలో అన్నిశాఖల అధికారులు భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు సూచించారు. మండలంలోని గంద్రాయి గ్రామంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రిని పలుశాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు కలిసికట్టుగా గ్రామంలోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం గ్రామాలను అన్ని శాఖల అధికారులు సందర్శించాలన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు యూనిఫాం సక్రమంగా వేసుకురావడం లేదని ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. పాఠశాలలోని ఫిర్యాదుల బాక్సును విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరి, ఎంపీడీవో రమేష్, ఎంఈవో చిట్టిబాబు, సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏపీవో సంతోష్, వైద్యాధికారి అనిల్‌కుమార్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు : ఎంపీడీవో

పెనుగంచిప్రోలు: వర్షాకాలం డయేరియా ప్రబలకుండా గ్రామాల్లో అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, మండల స్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రమైన నీటిని, ఆహారాన్ని తీసుకునేలా ప్రచారం నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నివారణకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల ఆటల పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.అమ్మాజి, ఎంపీడీవో హర్షసాయి, ఎంఈవో డి.రవీంద్ర, హెచ్‌ఎం జలజ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, అధికారులు



ఆటల పోటీలు పరిశీలిస్తున్న పెనుగంచిప్రోలు ప్రత్యేకాధికారి కృష్ణ చైతన్య తదితరులు

అమ్మవారికి సారె సమర్పణ



వేదపండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న సారె తెచ్చిన మహిళలు

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారికి హిందూ ప్రచారసమితి ఆధ్వర్యంలో సమరసతా సేవా ఫౌండేషన్ వారు బుధవారం సారె సమర్పించి బోనాలు చెల్లించారు. వీరికి ఆలయం వద్ద ఈవో కె.రమేష్‌నాయుడు, ఏఈవో తిరుమలేశ్వరరావు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు.

సారె తెచ్చిన మహిళలకు ఆలయ వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఈవో, అధికారులను సేవా ఫౌండేషన్ వారు సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ సీహెచ్ మార్కండేశ్వరరావు, జిల్లా మహిళా కన్వీనర్ కాకాని అయోధ్య, జిల్లా ధర్మ ప్రచారక్ జయశంకర్, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ ఎం.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యాయ కన్వీనర్ పెరుగు హనుమంతరావు, బీజేపీ నాయకురాలు కల్లూరి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



ఈవో రమేష్‌నాయుడును సత్కరిస్తున్న సేవా ఫౌండేషన్ సభ్యులు

ఘనంగా వాసిరెడ్డి వర్ధంతి

నందిగామ టౌన్: రైతునాయకుడు వాసిరెడ్డి నాగేశ్వరరావు 65వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన అమరస్థూపం వద్ద చిత్రపటానికి రైతుకూలీ సంఘం నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటమే లక్ష్యంగా ఆయన పోరాటం సాగిందన్నారు. ఈ పోరాటం ఫలితంగానే కౌలుదారీ రక్షణ చట్టం వచ్చిందని గుర్తుచేశారు. నాగేశ్వరరావుకు నివాళులర్పించిన వారిలో ఆసంఘ నాయకులు యాదల నాగేశ్వరరావు, రాంబాబు, ఆవుదొడ్డి నాగమల్లేశ్వరి, గ్రామస్తులు ఉన్నారు.

68 మందికి వైద్యపరీక్షలు



కంచికచర్ల : వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ తెలిపారు. మండలంలోని గండేపల్లి గ్రామంలో పెండ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 68మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వంటి వస్తువులు, ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్తను నిల్వ ఉంచకుండా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామని, రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య రాజనాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఖతర్ నుంచి విచ్చేసిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. ఖతర్‌కు చెందిన ఆంధ్ర నాట్య వేదికకు చెందిన పలువురు చిన్నారులు దుర్గమ్మ సన్నిధిలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలు కీర్తనలకు లయబద్ధంగా నాట్యాన్ని ప్రదర్శించారు. అనంతరం కళాబృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, అంగన్‌వాడీ, ఆరోగ్యసిబ్బంది, విద్యార్థులు

గొట్టుముక్కల(కంచికచర్ల): బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధికారిణి రజిని, ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. మండలంలోని గొట్టుముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలు, బాలురకు బాల్యవివాహాలతో జరిగే నష్టాలు, అరికట్టడంపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు 19ఏళ్లు నిండితేనే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్‌చేసి సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని బిడ్డలను చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి తుల్లిమిల్లి రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, ఎంఈవో బి.బాలాజీ, హౌసింగ్ ఏఈ సాయిబాబా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.15 వేల కోట్లు గ్రాంటా? రుణమా?

జై భీమ్‌రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జడ శ్రవణ్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన రూ.15 వేల కోట్లు గ్రాంటా? లేక రుణమా? స్పష్టం చేయాలి' అని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్ కుమార్ కోరారు. విజయవాడ గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే అడగలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. 164 సీట్లు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద సాగిలా పడుతోందన్నారు. కేంద్రం రూ.15 వేల కోట్లు అప్పుగా ప్రకటించిందన్నారు. అప్పునకు వడ్డీ మనమే కట్టాలని, అసలూ మనమే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం హామీ మాత్రమే ఇస్తుందన్నారు.

ప్రజల కళ్లకు గంతలు..

బడ్జెట్‌పై రాజకీయ నేతల మాటలు రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల కళ్లకు గంతలు కడుతోందన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.10 వేల కోట్లు కూడా రాష్ట్రానికి కేటాయించాలేదన్నారు. ప్రతిపాదనలు అన్ని ఇచ్చారని చెబుతున్న సీఎం చంద్రబాబు అప్పు ఇవ్వాలని కేంద్రాన్ని అడిగారా? అని నిలదీశారు. గుజరాత్ రాష్ట్రానికి కేంద్రం స్పష్టమైన కేటాయింపులు చేసిందని గుర్తుచేశారు. బిహార్‌కు రూ.58,900 కోట్లు కేటాయించారన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకుడు పరసా సురేష్ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో చోరీ

పాయకాపురం(విజయవాడరూరల్): తాళం వేసి ఉన్న ఇంట్లో జరిగిన చోరీపై నున్న పోలీసులకు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వాంబేకాలనీ 8వ బ్లాక్‌లో వెలట్ల మనోజ్‌కుమార్‌కు చెందిన ఇంటిలోని సభ్యులందరూ కింద పోర్షన్‌కు తాళం వేసి మొదటి అంతస్తులో మంగళవారం రాత్రి నిద్రించారు. బుధవారం ట్యూషన్ చెప్పడానికి కింద పోర్షన్ తాళం తీసేందుకు వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న డబ్బు, బంగారం, వెండి వస్తువులు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

నందిగామ టౌన్: అంగనవాడీ కేంద్రాలు, పాఠశాలల ఆవరణల్లో పరిశుభ్రత పాటించాలని ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ ఉమాదేవి సూచించారు. నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు మండలంలోని అంబారుపేటలోని అంగనవాడీ కేంద్రం, మండల పరిషత్ పాఠశాలను ఆయా శాఖల అధికారులతో కలిసి బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించాలన్నారు. అంబారుపేట గ్రామంలోని అంగనవాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. ఆకుకూరలు, కాయగూరల విత్తనాలు చల్లారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించి బాల్య వివాహాలతో కలిగే నష్టాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానాతోపాటు రెండేళ్ల జైలుశిక్ష పడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వనాథ్, తహసీల్దార్ శేషగిరి, సీడీపీవో భాగ్యరేణుక, ఏసీడీపీవో కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు, అంగనవాడీ కార్యకర్తలు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలను బలిచేసుకోవద్దు

జడ్జిలు శ్రావణి, శోభారాణి



మాట్లాడుతున్న జడ్జి శ్రావణి, వేదికపై జడ్జి శోభారాణి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: అవగాహనతోనే ర్యాగింగ్ పెనుభూతాన్ని నివారించవచ్చునని జగ్గయ్యపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి పేర్కొన్నారు. స్థానిక జేఆర్సీ–విశ్వభారతి డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నివారణ అవగాహన బుధవారం సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జిలు శ్రావణి, శోభారాణి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను బలిచేసుకోవద్దని సీనియర్ విద్యార్థులకు సూచించారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ర్యాగింగ్ చట్టాలు కఠినతరంగా ఉంటాయని, అటువంటి చర్యలకు పాల్పడి నష్టపోవద్దన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులంతా ఏకష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవడం ద్వారా తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం డిగ్రీ రెండు, నాలుగో సెమిష్టర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలను అందజేసి అభినందించారు.కార్యక్రమంలో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు, ఏజీపీ టీఎల్.నరసింహారావు, కళాశాల ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, కొల్లా నాగరమేష్, జల్లా తిరుపతిరావు, నారాయణరావు, న్యాయవాదులు గోపినాథ్, మెట్టిల ఆంజనేయులు, దాసరి నాగేశ్వరరావు, దేశింగ్ రాజు, కృష్ణ, విజయకుమారి, మనోహర్, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కేవీకే కోర్డినేటర్ డాక్టర్ కృష్ణంరాజు



కంచికచర్లలో పెసరపంటను పరిశీలించి సూచనలిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణంరాజు

కంచికచర్ల : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కంచికచర్ల, బత్తినపాడు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటికి పంపించాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న పొలంలో అధిక తేమశాతం ఉందని దీంతో మొక్కలు ఎర్రబడుతున్నాయన్నారు. ఆ మొక్కలు తిరిగి కోలుకోవాలంటే ఎకరానికి 20కేజీల యూరియా లేదా పొటాషియం ఎరువులను వేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా సూక్ష్మ పోషకాలు కలిగిన ఫార్ములా 4, ఫార్ములా 6 మల్టీకే పొటాషియం నైట్రేట్ వంటివి పిచికారీ చేసుకోవాలన్నారు. పెసర పంట పూత దశలో ఉందని వర్షాలు తగ్గిన వెంటనే మారుక మచ్చల పురుగు ఉంటుందన్నారు. దీని నివారణకు క్లోరిపై రీఫాస్ 2.5ఎం.ఎల్ లేదా నోవాల్యురాన్ 1ఎం.ఎల్ లేదా ఎమా మాక్టిన్ బెంజోయెట్ 0.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచకారీ చేయాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి కేజీ యూరియా, లేదా పొటాష్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏడీఏ ఐకే శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, గ్రామీణ వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

27వరకు ఆధార్ క్యాంపులు



సచివాలయంలోని ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో వివిధ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు కోరారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం, పాతపేట గడ్డ సమీపంలోని మీ సేవా బిల్డింగ్‌లో ఉన్న సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు మొత్తం 60 సర్వీసులను చేశారని తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించే ఈ ఆధార్ క్యాంపులలో కొత్తగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌ను ఉచితంగా చేస్తారని వివరించారు. ఆధార్‌నమోదు చేయించుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నందిగామ పట్టణంలో...

నందిగామ టౌన్:పట్టణంలోని ఏడు, పదో సచివాలయాల్లో గురువారం ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ హేమమాలిని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపులో కొత్తగా ఆధార్ నమోదు, ఫోన్ నంబరు లింక్ చేయడం, వేలిముద్రలు అప్‌డేట్ చేయడం, తదితర సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌలు వేలం రసాభాస



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భూముల బహిరంగ కౌలు వేలం పాటలు రసాభాసగా మారింది. ఆలయ ప్రాంగణంలో వేదాద్రి, బండిపాలెం, రావిరాల గ్రామాల్లో ఆలయానికి ఉన్న 16ఎకరాల భూములకు బుధవారం కౌలువేలం నిర్వహించారు. ఈక్రమంలో ఓ ఐదుగురు రైతులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా వేలం పాటల్లో పాల్గొంటూనే ఈ భూములు సాగు చేస్తున్నామని, అయితే రెండు నెలల కిందట నిర్వహించాల్సిన వేలం నిర్వహించకపోవడంతో ప్రస్తుతం ఆభూముల్లో పంటలను సాగుచేశామని అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం పొలాలలో పైరు కూడా ఉందని వివరించారు. ఈసమయంలో కౌలువేలం నిర్వహించడం ఏమిటంటూ దేవాదాయశాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కౌలువేలం కార్యక్రమం రసాభాసగా మారింది. పరిస్థితి అదుపు తప్పేలా ఉండటంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపు చేశారు. ఈసందర్భంగా ఆలయ ఈవో హేమలతాదేవి మాట్లాడుతూ నాలుగు సార్లు భూములకు కౌలువేలం పాటలు నిర్వహించామని రైతులు రాకపోవడంతో వాయిదా వేసినట్లు వివరించారు. ప్రస్తుతం కౌలు చేస్తున్న భూములు ల్యాండ్ లెస్ భూములు (సన్నకారు రైతుల భూములు) అని ఇటీవల జిల్లా ఏసీ ఈభూములను రద్దు చేశారన్నారు. దీంతో రైతులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు తీర్పు కూడా దేవాదాయశాఖకు అనుకూలంగా వచ్చినందునే ఈ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాగు చేస్తున్న రైతులు కూడా ఇటీవల సర్వే అధికారులు వస్తే సంతకాలు చేశారని వివరించారు. దీంతో చేసేదేమీ లేక రైతులు కౌలు వేలం పాటలు నిర్వహించాలని కోరడంతో పాటలు నిర్వహించారు.

రూ.75వేల ఆదాయం...

అనంతరం 16ఎకరాల భూములకు కౌలువేలం నిర్వహించగా రూ.75వేల ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. గతం కంటే రూ.10 వేల అధికంగా ఆదాయం వచ్చినట్లు ఈవో వివరించారు. అయితే కౌలువేలాన్ని అడ్డుకున్న రైతులే కౌలుహక్కులను వేలం ద్వారా పొందడం గమనార్హం. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.